# సిరిసిల్లా-వేములవాడ

# రైతాంగ పోరాటం

"సిరిసిల్లా, జగిత్యాల తాలూకాలలో కల్లోలిత ప్రాంతాల ప్రకటనను ఎత్తివేయాలి-" ఈ నినాదం తెలంగాణా పట్టణాలలో గోడలపై విస్తృతంగా కనిపిస్తుంది. 1978, అక్టోబర్‌లో "కల్లోలిత ప్రాంతాల" ప్రకటన చేసినప్పుడు సిరిసిల్లా తాలూకాగా వుండిన ప్రాంతాన్ని, ఆ తరువాత, సిరిసిల్లా వేములవాడ తాలూకాలుగా విభజించారు. అందువల్ల, వేములవాడ "కల్లోలిత ప్రాంతం" గానే పుట్టిందని చెప్పవచ్చు. కరీంనగర్-కామారెడ్డి రోడ్డు యీ రెండు తాలూకాలను విభజించే రేఖ. దీనికి వుత్తరంగా వేములవాడ, దక్షిణంగా సిరిసిల్లా తాలూకాలుంటాయి. ఈ రెండు కలిసి కరీంనగర్ జిల్లా ఈశాన్యమూలను ఆక్రమిస్తాయి.

అకెడెమిక్స్ కళ్ళింకా కరీంనగర్ రైతాంగ పోరాటంపై పడలేదు. పడినప్పుడు, ఒక వాస్తవం వాళ్లకు కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. ఈ పోరాటం ప్రారంభమైంది 1970లో. గోదావరి నది మీద కట్టిన పోచంపాడు ప్రాజెక్టు కరీంనగర్ జిల్లాలో కొన్ని ప్రాంతాలకు నీళ్లందించటం ప్రారంభమైంది కూడా 1970 లోనే. ఇది రైతాంగ పోరాటాంపై ప్రసిద్ధ ఆకాడెమిక్ సిద్ధాంతాలకు చక్కగా నప్పుతుంది. బ్యారీ పేవియర్ ధనిక రైతు సిద్ధాంతాలకు కుదురుతుంది. బిరోపా సైన్యం, పరిశ్రమల అవసరాల కనుగుణంగా, నదిన అముదాలం, వేరుశనగ విప్లవంగా-1940 తరువాత వచ్చిన తెలంగాణా రైతాంగ పోరాటాలను వివరించడానికి పేవియర్ ప్రయత్నించాడు. (నీటి పారుదల - పెట్టుబడి చొరబాటులో - వ్యత్యాసాల ప్రాతిపదికపై పేవియర్ సిద్ధాంతం ఆధారపడుతుంది. (built around the irrigation–capital pene-tration differerniation syno-trome)

కాని, యీ పెట్టుబడి-చొరబాటు సిద్ధాంతాన్ని నమ్ముకున్న అకాడెమిక్స్ ఎదుర్కొనే సమస్య ఒకటుంది. పోచంపాడు కాలువ కరీంనగర్ జిల్లాలోని దక్షిణ ప్రాంత తాలూకాలలో ప్రవహిస్తుంటే, పోరాటం సిరిసిల్లాలో వేములవాడ ప్రాంతంలో ప్రారంభమైంది. అది కూడా, సిరిసిల్లాలో, ఏదో మేరకు వరి పండించే ప్రాంతంలో కాకుండా, ప్రధానంగా జొన్న, మొక్కజొన్న పండించే వేములవాడ చిట్టి-అడవి ప్రాంతంలో ప్రారంభమైంది (40 సంవత్సరాల నాటి ఎగువ మానేరు ప్రాజెక్టు క్రింద కొంత ప్రాంతానికి నీళ్ళందుతాయి). ఈ సెప్టెంబర్ నెలలో ఖరీఫ్ పంట కాలం మొదలైన 8 వారాల తరువాత చూస్తే వేములవాడ-పొదలతో, రాతి భూములతో, అక్కడక్కడ మనిషెత్తు మొక్కజొన్న, జొన్న కర్రలతో-పాడుబడినట్లుగా కనిపిస్తున్నది.

వాస్తవ పరిస్థితిని బాహ్యాత్మకంగా పరిశీలించినట్లయితే, ఇక్కడ పోరాటం ప్రబద్దలు కావడానికి కారణం పెట్టుబడి చొరబడడం కాదనీ, కమ్యూనిస్టు కేదరు చొరబడడమేనని తెలిసిపోతుంది. నిజానికి, 1940 ప్రాంతాల్లో రైతాంగ పోరాటంలో పాల్గొన్న కొన్ని ప్రాంతాలలో యీ సిరిసిల్లా తాలూకా కూడా ఒకటి. పి. సుందరయ్య (తన "తెలంగాణా ప్రజా పోరాటం-గుణపాఠాలు" పుస్తకంలో) 1950-జూన్ 10న సిరిసిల్లా పోలీసు స్టేషన్‌పై గెరిల్లా దళం జరిపిన దాడిని టర్నింగ్ పాయింటుగా పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లాలోని పెక్కు గ్రామాలలో-భూస్వామ్య పీడనకువ్యతిరేకంగా, ప్రభుత్వ ధాన్యం లెవీకి వ్యతిరేకంగా సమరశీల ప్రజాపోరాటాలకు - యీ దాడి దారి తీసిందని పేర్కొన్నారు. (నాటి వీరోచిత పోరాటానికి ఒక అవశేషంగా, సి పి.ఐ. ఎంఎల్‌ఏ సి. హెచ్. రాజేశ్వరరావు సిరిసిల్లా నుండి గెలిచాడు. ఇతగు స. పి. ఐ. ప్రధాన కార్యదర్శి కాదు. వేరే రాజేశ్వరరావు) కాని, ప్రస్తుత పోరాటం గత సమరశీల పోరాటపు పునరుద్ధరణగా భావించడం కేవలం ప్రతీకాత్మకంగానే

అవుతుంది. ఎందుకంటే, 1964 పార్టీ విభజన సమయంలో, మొత్తం నాయకులు (అందువల్ల, మొత్తం కేడరు) సి.పి.ఐ తోనే వుండి పోయింది. ఒక్క బద్దం ఎల్లారెడ్డి మాత్రం కేవలం 8 నెలల పాటు సి.పి.ఎం. లో వుండి, తిరిగి సి.పి.ఐ. లోనికి వెళ్ళిపోయాడు. పర్యవసానంగా, 1967లో సిపిఎం నుండి విప్లవ కమ్యూనిస్టులు బయటకు వచ్చినప్పుడు, కరీంనగర్‌లో సి.పి.ఎం. నుండి బయటకు రావడానికి అక్కడ ఎవరూ లేరు. ప్రస్తుత వుద్యమాన్ని నడిపిన వాళ్ళంతా 1970లో రాజకీయంగా ప్రారంభకులే, వాళ్ళు వుద్యమంతో పాటే పెరిగారు అందువల్ల, కరీంనగర్ విప్లవ కమ్యూనిస్టు నాయకులలో మూడు పదులు దాటిన వాళ్లు చాల తక్కువ.

## ప్రారంభం

1970-71లో వీళ్లు, నిజామాబాద్ జిల్లా నుండి, కొండల్లాగ కనిపించే ప్రాంతాన్ని దాటి, పాత సిరిసిల్లాలోని ఈశాన్య ప్రాంతం (ప్రస్తుత వేములవాడ పశ్చిమ ప్రాంతంలోనికి ప్రవేశించారు. 1967 వసంత మేఘగర్జన వుత్తేజంతో అంతవరకు తాము పని చేస్తున్న నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ తాలూకాని నిర్బంధం వల్ల, వాళ్ళీ దిశగా ప్రయాణించారు. ఇక్కడ వాళ్ళకు, ఎదురైంది నీరులేని చిట్టి-అడవి ప్రాంతం, అసఫ్ జాహి కాలపు ఫ్యూడల్ విధానాల క్రింద నున్న గ్రామాలూ, దొరలు, దేశముఖులుగా, జాగీర్దార్లుగా లేరన్నది నిజమే, కాని సారాంశంలో పెద్ద తేడా లేదు.

అత్యవసర పరిస్థితి ప్రకటన వరకు పోరాటం నిమ్మపల్లి, కోన

కె. బాలగోపాల్
యం. కోదండరామిరెడ్డి

రావు పేట, వీర్నపల్లి కేంద్రంగా కొద్ది గ్రామాలలో మాత్రమే సాగుతున్నది. నిమ్మపల్లి దొర పేరు బొంతం భాస్కరరావు, ఇతనికి 1600 ఎకరాల భూమి వుందంటారు. ఇతని విషయంలోనూ, డజెన్లమంది ఇతరుల విషయంలోనూ వాళ్ళ భూముల విస్తీర్ణం ఆశ్చర్యకరమైన సంఖ్యల్లో వుంటాయి. వీటిమీద యాజమాన్యం చట్టబద్ధంగా గానీ, చివరకు బినామీగా గానీ వుండదని తెలిసేదాక, [illegible] ఆరోపణలు నమ్మదగ్గవిగా కనిపించవు. వీళ్ళ గ్రామాల వుమ్మడి భూముల మీద, అడవి భూమి, ఎవరి పేరిటా రికార్డు కాని భూమి మీద, చెరువు శిఖం, నదీ తీరాల భూముల మీద చివరకు సాగుకు లాయకు కాని, బంజరు భూములమీద-యాజమాన్యం చెలాయిస్తుంటారు. వీటివల్ల వాళ్ళకేదో లాభం వుంటుందనికాదు. గ్రామీణ పేదల (మరీ అంత పేదలు కాదు) కు యివి దక్కకుండా చూడడానికే వాటిపై పెత్తనం చెలాయించడం. మరో మాటలో, ఖచ్చితమైన (బూర్జువా) అర్థంలో యాజమాన్యం చెలాయించడం కాదిది. ఫ్యూడల్ అధికారం చెలాయించడంలో భాగం.

1950 ప్రాంతాల్లో ఎప్పుడో, భాస్కరరావు తండ్రో, తాతో "తన" భూమిలోంచి 22 ఎకరాలు కొన్ని హరిజన కుటుంబాలకు యిచ్చాడు. రైతాంగ సాయుధ పోరాటం తరువాత, గ్రామిక ప్రజలతో మంచి సంబంధాలు పెట్టుకోవాలన్న కోరిక దీకి కారణమని చెబుతారు. ఆ రోజుల్లో యీ నిమ్మపల్లి గ్రామం (అలాగే వీర్నపల్లి) "కమ్యూనిస్టుల బలమైన కేంద్రంగా'' వుండినదని సుందరయ్య పేర్కొన్నారు. కాని 1970 వచ్చేసరికి, యీ 22 ఎకరాల్లో మంచి ఆదాయం వచ్చే అవకాశం ఏర్పడింది. మూలవాగు అనే చిన్న ఏటిమీద కట్టిన వంతెన (ఇది 1978 లో పూర్తయ్యింది) క్రింద సుమారు 2500 ఎకరాలలో

భాగంగా దీనికి నీరందే అవకాశం వచ్చింది. అందువల్ల భాస్కరరావు యీ భూమి తిరిగి తనక్కావాలని, హరిజనకుటుంబాల్ని వెళ్ళగొట్టాడు. వాళ్లు పార్టీని సంప్రదించారు. ఇదే ఆ తరువాత చంద్రపుల్లారెడ్డి నాయకత్వంలోని సి పి ఐ (ఎం.ఎల్.) అయ్యింది. పార్టీ అప్పుడే కొన్ని పొరుగు గ్రామాలలో ప్రచార కార్యక్రమాలు ప్రారంభించింది. 1978 లో, నిమ్మపల్లి, కోనరావుపేట, వీర్నపల్లి గ్రామాల్లో రైతుకూలీ సంఘాలు ఏర్పడ్డాయి. ఈ 22 ఎకరాలు ఆక్రమించుకుని నువ్వులు వేయండని సంఘం హరిజనులకు పిలుపు నిచ్చింది. దొర కిరాయి గూండాలతో దాడిచేయించడంతో హరిజనులు వెనుకడుగు వేశారు. ఆ తరువాత సంవత్సరం, సంఘం, యీ భూమి ఆక్రమణకు మూడు గ్రామాల ప్రజల్ని కదిలించింది. పర్యవసానంగా మొదలైన ఘర్షణలో పోలీసులు ప్రవేశించారు. మూడు గ్రామాల్లో పోలీసు క్యాంపులు పెట్టి, పెక్కుమంది ప్రజల్ని సిరిసిల్లా కుట్రకేసులో యిరికించారు. (కుట్ర కేసులనేవి పోలీసులకు ఒక ఫ్యాషన్‌గా వున్న రోజులు). వాటిలో చాలా కేసులను కోర్టులు కొట్టేయడం వల్ల, వాటిపై పోలీసులకు వుత్సాహం తగ్గిపోయినట్లుంది.) సాక్షులు దొరక్కపోవడంతో, యీ కేసును కూడా కొట్టేశారు. కాని, యీ లోపల దొర 22 ఎకరాలను ఆక్రమించుకున్నాడు.

## నిర్బంధం, ప్రతిఘటన

రికార్డు చేయాల్సిన విషయం భూస్వామ్య పీడన, ప్రజా ప్రతిఘటన వివరాలు కాదు (ఇవి గ్రామ గ్రామాన ఒకే విధంగా వుంటాయి). కాని, ప్రత్యేకించి నిర్బంధ పరిస్థితులతో, ప్రజలు అభివృద్ధి చేసుకున్న వ్యూహమూ, ఎత్తుగడలను గమనించాల్సి వుంటుంది నిర్బంధం కాలంలో "విస్తరించిన ప్రాంతాలను సంఘటితం చేసుకుంటూ, విస్తరించడమే ప్రధాన ప్రతిఘటనా రూపం" అన్న ఎత్తుగడను నిమ్మపల్లి పోరాటం కాలం నుండీ వాళ్లు అనుసరిస్తూ వచ్చారు. నిమ్మపల్లిపై నిర్బంధం పొరుగు గ్రామాలలో విస్తరణకు దారి తీసింది. అదే సమయంలో ఇతర సమస్యలపై పోరాటాల రూపంలో - తునికాకు కూలీ రేట్లు, వ్యవసాయ కూలీలు, పాలేర్ల, గ్రామీణ పాలనలో అవినీతి మొదలైన సమస్యలపై పోరాటాల రూపంలో-నిమ్మపల్లి ప్రాంతాల్ని సంఘటితం చేసుకున్నారు. 22 ఎకరాలు ఆక్రమించడానికి రెండు, విఫల ప్రయత్నాల మధ్యకాలంలో, వుద్యమం సిరిసిల్లా, వేములవాడ పట్టణాల్లో విద్యార్థి యువజనుల లోనికి వ్యాపించింది, నిమ్మపల్లి పోరాటం "నాంది" అనే నాటకం ద్వారా ప్రచారంలోనికి వచ్చింది. తమ "విస్తరణ, సంఘటన" ఎత్తుగడలలో భాగంగా తునికాకు పోరాటాన్ని తీసుకున్నారు. కమ్యూనిస్టు విప్లవ కారులు గోదావరి లోయ ప్రాంతంలో గిరిజన, తదితర ప్రజానీకాన్ని సమీకరించడం ప్రారంభించినప్పటి నుండీ (అంటే, 1970 ముందు దినాల నుండీ) తునికాకు కూలీ పోరాటం, నిజానికి నిరంతర పోరాటం అయ్యింది. వేములవాడ చిట్టి-అడవి (Shrub Forest) గోదావరి లోయ అడవిలోయలో భాగం కానప్పటికీ, యిక్కడి తునికాకు కూలీ పోరాటం సాధారణ పోరాటంలో భాగం అయ్యింది.

ప్రతిఏడు, వేసవి ప్రారంభాని కల్లా, తునికాకులు తెంపడానికి వీలుగా తయారవుతాయి. వ్యావసాయికంగా సీజన్ కాదు గనుక, భూమిలేని, నిరుపేద రైతాంగ ప్రజలకు చాల అవసరమైన ఆదాయానికి తునికాకు వనరు అవుతుంది. పూర్వం వాళ్లు ఆకులుతెంపి. కంట్రాక్టర్లకు (గుత్తెదార్లకు) అమ్మే వాళ్లు, వంద ఆకుల కట్టకు 2 లేక 3 పైసల రేటు దొరికేది. గ్రామంలోని ''కల్లా''ల్లో, కంట్రాక్టర్ ఏజెంటు (కల్లేదారు) ఆకు కొనుగోలు

# తునికాకు గుత్తేదార్ల రక్షణకు వచ్చిన ప్రభుత్వం

చేస్తారు "వ్యాపారంలాగ" కనిపించే యీ వ్యవహారంలో కూడా, కంట్రాక్టర్ "వేతనం లేకుండా" శ్రమ దోపిడీ చేయడం-యీ ప్రాంతంలోని భూస్వామ్య వాతావరణం ప్రత్యేకత. ప్రతిపది కట్టల్లో ఒకటి రెండు కట్టల్ని ఏదో ఒక దేవత పేరిట "పుచితం"గా తీసేసు కుంటారు. శ్రామికుడు, ఆరోజు కల్లానికి తెచ్చిన వాటిలో మొదటి కట్టను శుభశకునంగా ''పుచితం''గా తీసేసు కుంటారు.

## రక్షణకువచ్చిన ప్రభుత్వం

ఈ భూస్వామ్య ఆ చారాల్ని నిర్మూలించి, తునికాకు కూలీరేట్లను పెంచడం కోసం సంఘం పోరాటం చేపట్టింది. దీనికి ప్రభుత్వం నుండి తక్షణ ప్రతి చర్య వచ్చింది. ప్రభుత్వం, కాంట్రాక్టర్లను రక్షించడం కోసం యీ వ్యాపారాన్నే జాతీయం చేసింది. ప్రైవేటు రంగాన్ని రక్షించడానికి జాతీయీకరణ నుపయోగించడం వుపయోగకరమా, కాదా అన్నదానికి ఈ చర్య ఒక ప్రయోగం వంటిది. ప్రభుత్వం తునికాకు సేకరణకు సహకార సంఘాల్ని గానీ, పబ్లిక్‌రంగ కార్పొ

[redacted]

రేషన్లను గానీ ఏర్పరచకుండా; తునికాకు కూలీలనుండి తాను కొనుగోలు చేసి (ఆ విధంగా వారి ఆందోళన భారం తాను వహించి), ఆ తరువాత ఆకును కాంట్రాక్టర్లకు అమ్ముతుంది. దీనికి గాను కంట్రాక్టర్లు అదనంగా, కొనుగోలు చేసిందానికి అనుగుణంగా రాయిల్టీ చెల్లిస్తారు. ఇక్కడ కూడా, కొనుగోలు కోసం ప్రభుత్వం ఫారెస్టు డిపార్టుమెంటును నియోగించలేదు. కత్తెదార్లు స్వయంగా కొనుగోలు చేయడానికి అవకాశమిచ్చింది. దానికై డబ్బు అడ్వాన్సుగా యివ్వడం కూడా మొదలయ్యింది. ఒక ప్రక్క తునికాకు కూలీల ఆందోళన భారాన్ని ఫారెస్టు డిపార్టుమెంటు మీదకుతోసి, కంట్రాక్టర్లు విశ్రాంతిగా కూర్చునే అవకాశం కల్పించింది; మరో ప్రక్క, అలవిగాని అవినీతికి అవకాశమూ కల్పించింది. జాతీయాకరణ వల్ల జరిగిందిదే.

ఇపుడు, కాంట్రాక్టర్లు ఫారెస్టు డిపార్టుమెంటుతో చేతులు కలిపి కొనుగోలు చేసిన ఆకును తక్కువగా చూపించి, రాయల్టీలో పెద్ద మొత్తాలు మిగిలించుకుంటారు. తునికాకు గుత్తెదార్లు ఫారెస్టు డిపార్టుమెంటు అధికారులకు చెల్లించే లంచాలు సీజన్‌కు కొన్ని పదుల వేల రూపాయలదాకా వుంటాయి.

తునికాకు కూలీ పోరాటం దాని కదే ఒక కథ కాని, సిరిసిల్లా కథనానికి సంబంధించినంత వరకు చూస్తే, భూస్వామ్య – వ్యతిరేక పోరాటాలపై తీవ్ర నిర్బంధం కొనసాగుతున్నప్పుడు, ''విస్తరణ, సంఘటనల ద్వారా ప్రతిఘటన'' అన్న ఎత్తుగడకు యిది ఒక మార్గంగా పని చేసింది.

1975లో, నిమ్మపల్లిలో సంఘం తిరిగి విజృంభించింది. ఈసారి, వివాదాస్పదంగా వున్న 22 ఎకరాలలో చింత చెట్లు దులుపుకునే కార్యక్రమం తీసుకుంది. భాస్కరరావు ఆ భూమి చుట్టు కంచెవేసి, వాటిపై తన యాజమాన్యానికి గుర్తుగా, వాటి చుట్టు తెల్లరంగు వేయించాడు. హరిజనులు కంచె తొలగించి, తెల్ల రంగు మీద ఎర్రని రంగువేసి, ఆ భూమి దానిలో పంట తమదని ప్రకటించారు.

నిర్బంధం తిరిగి ప్రారంభమైంది. కాని, అప్పటికల్లా విస్తరణ సంఘటన ఎత్తుగడ ఫలించింది. ప్రజలు నిర్భయంగా నిలబడ్డారు. త్వరలో ఎమర్జెన్సీ ప్రకటించబడింది. మొత్తం వుద్యమం వెనుకడుగు వేసింది. అయితే, యీలోగా, విస్తరణను సంఘటితం చేసుకునే క్రమంలో, ఆ ప్రాంతంలోని పెక్కు గ్రామాలలో భూస్వామ్య పీడనకు వ్యతిరేకంగా నిర్దిష్ట పోరాటాలు చేపట్టారు. ఆ విధంగా, ఎమర్జెన్సీ ఎత్తివేతకోసం నిరీక్షిస్తూ అజ్ఞాతంగా జీవించ గలిగారు.

(మిగతా వచ్చే సంచికలో)

"విస్తరించిన ప్రాంతాలను సంఘటితం చేసుకుంటూ, విస్తరించడమే ప్రధాన ప్రతిఘటనా రూపం"

నిమ్మపల్లి ప్రాంతంలో వుద్యమం అజ్ఞాతంలోనికి వెళ్ళిన తరువాత "విస్తరణ ద్వారా ప్రతిఘటన" అనే ఎత్తుగడను మరోసారి అమలు జరుపడం జరిగింది వాళ్ళు కరీంనగరు కామారెడ్డి రోడ్డు దక్షిణ దిక్కుకు ప్రస్తుత సిరిసిల్లా తాలూకా పశ్చిమ భాగానికి ప్రయాణించారు. రైతు కూలి సంఘం పేరు మీద (పార్టీ సంగతి సరేసరి) యింకే మాత్రం పని చేయడానికి వీల్లేక పోయింది. కాని. యీ ప్రాంతంలో వాళ్ళకు ఒక పరిస్థితి కనపడింది. సుమారు 17000 ఎకరాలు విస్తరించిన సుమారు 80, 40 గ్రామాల ప్రాంతానికి ఎగువ మానేరు ప్రాజెక్టు నీళ్లు అందుతున్నాయి. ఎమర్జెన్సీ కంటె ముందునుండినే అంటరానితనానికి వ్యతిరేకంగా, పాలేర్ల అధిక వేతనాల కోసము యిక్కడ "హరిజన వుద్యమం" వుంది. ప్రజలు తమ తగాదాలను దొర దగ్గరే పరిష్కరించుకొనే పద్ధతికి వ్యతిరేకంగా వచ్చిన సమస్య కూడా ముఖ్యమైనదే (దీని ద్వారా, దొరతన అధికారాన్ని అమలు జరుపుకోవడమే గాకుండా, తగాదాలోని రెండు పార్టీలు దొరకు మామూళ్లు యివ్వాల్సి వుంటుంది. ఇది ఫ్యూడల్ తెలంగాణాలో చిర కాలంగా వుంటూ వచ్చింది.) గూడెంకు చెందిన రాములు, చీకోడుకు చెందిన మల్లయ్య అనే యిద్దరు హరిజన పాలేళ్ళు, యీ సమస్యలపై పోరాడడం కోసం ఒక హరిజన సంఘాన్ని స్థాపించారు. ఇందిరా గాంధీ ప్రసిద్ధ 20 - సూత్రాల పథకాన్ని అమలు చేయాలనే డిమాండు మీద వీళ్ళు పోరాటం నిర్మించారు. (ఇట్లా డిమాండు చేయడం ఎత్తుగడ రీత్యానా, నిజంగా ఆశించేనా అన్నది స్పష్టం కాలేదు.) నిమ్మపల్లి నుండి తప్పించుకొని పోయిన విప్లవకారులు యీ హరిజన సంఘంలో కలిశారు. చాల కాలం వరకు తమ విభిన్న సిద్ధాంతాన్ని బయటకి చెప్పలేదు. పోగా. ఎమర్జెన్సీ ఎత్తి వేయబడే దాకా, వాళ్ళు 20-సూత్రాల కార్యక్రమం పరిభాషలోనే తమ డిమాండ్లను వెలువరిస్తూ వచ్చారు. కాని, క్రమక్రమంగా హరిజన సంఘం స్వభావాన్ని మార్చివేయడం ప్రారంభించారు. ఎమర్జెన్సీ అంతానికి హరిజన సంఘం చివరిరోజులకు, దాన్ని తొలగించి, ఆ స్థానంలో రైతు కూలి సంఘాన్ని ముందుకు తెచ్చారు. రాములు మల్లయ్య యిద్దరు కూడా — వారి భాష (ఆ మాటకొస్తే, యీ ప్రాంత కార్యకర్తలందరి భాష కూడా) వారి వర్గ-పోరాటం-ప్రారంభ దినాలను జ్ఞాపకం తెస్తున్నప్పటికీ - యీనాడు సి. పి. ఐ. (ఎం. ఎల్)తో వుంటున్నారు ఇతర ప్రాంతాలలో కార్యకర్తలు పీడకులను దొర, భూస్వామి అని వ్యవహరిస్తే, యీ ప్రాంతం వాళ్ళు "ఆ రెడ్లు, ఆ రావులు" అనే తమ పాత అలవాటుకు, పొరపాటున పడుతుంటారు. (ప్రతి రావు వెలమ కులం కాదుగానీ, యిక్కడ రావులంటే వెలమ సంగతే) పీడన, పోరాటాల గురించి గ్రామం-గ్రామం పేర్కొంటూ పోతే,-సంక్షిప్తంగానైతే ఒకే మూసగా వుంటుంది. లేక గ్రామం గ్రామం మధ్య వ్యత్యాసాలతో చెప్పుకుంటూ, వివరంగా పేర్కొంటే, వ్యాస విస్తరణ అవుతుంది పోరాటం ప్రధానంగా భూస్వామ్య-సామాజిక-పీడనకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడింది. ఇదే, తెలంగాణాలో, చాలా విభిన్నమైన రూపాలు తీసుకుంటూ వుంటుంది. తెలంగాణా భూస్వామ్య విధానంలో, వెట్టిలేక వెట్టి చాకిరీ (బేగార్)-దాని అసంఖ్యాక రూపాలతో,-చాల కొట్టొచ్చినట్లు కనిపించే ఫ్యూడల్ లక్షణం. రైతులు దొరల చేలల్లో వేతనం లేకుండా వుత్పాదక శ్రమ చేయడమే గాకుండా, అన్ని కులాల్లోని శ్రామికులు వెట్టి చేయాల్సిందే కల్లు-గీత కార్మికులు కల్లు వుచితంగా అందించాలి. కుమ్మరి వాళ్ళు వుచితంగా కుండలివ్వాలి. ఇలా కుల ప్రాతిపదికపై సాగుతుం

టుంది. కొన్ని కులాల వాళ్ళు (చాకలి, మంగలి మొ॥) తమ కుల వృత్తితో సంబంధం లేని యింటి పనులు వెట్టికి చేయాలి. సాధారణంగా చెప్పాలంటే, ఏ వస్తువయినా (అది మానవుడు కావచ్చు, మరొకటి కావచ్చు.) దొర కళ్ళల్లో పడిందంటే చాలు దాన్ని అతడు తీసేసుకోవచ్చు.

పూర్వ హరిజన సంఘం మొదటి పోరాటం గూడెంలో ప్రారంభమైంది. యీ వెట్టికి వ్యతిరేకంగానే; చివర, మరో పెద్ద పోరాటం ద్వారా వెట్టిగొర్ల పద్ధతిని-గొల్లవారు దొరకు ఉచితంగా గొర్రెలు, మేకలు యిచ్చే పద్ధతిని - అంతం చేసుకున్నారు. ఆచారంగా (దసరావంటి పండుగ దినాలలో) యిచ్చే గొర్రెల నజరానాలు (బహుమతులు) కాకుండా ఏడాదికి కొన్ని, నిర్దిష్ట సంఖ్యలో ఒక్కసారి గ్రామానికి 30 నుండి 40 దాక, గొర్రెలు, మేకలను యివ్వాల్సి వుండింది. మరో విచిత్ర రూపంలో వెట్టి యిక్కడ వుంది. ప్రత్యేకించి, ఎగువ మానేరు ప్రాజెక్టు కింద నున్న యీ గ్రామ సముదాయంలో యీ వెట్టి రూపం ముఖ్యంగా వుంది. బలవంతంగా, మూల్యం లేకుండా ఎరువులు వెట్టికి యివ్వాలి. ఖరీఫ్ పంటకు ముందు, దొరల చేలల్లో, గొల్లవారి గొర్రెలు వెట్టికి మంద పెట్టాలి. వీటినే వెట్టి మందలంటారు. సాధారణంగా, దొరలు 2, 3 నెలల పాటు (వెట్టి) మంద పెట్టాలని డిమాండు చేస్తారు. "ఆ తరువాత ఆ భూమిలో ఏదైనా పండించొచ్చు" నంటారు రైతులు. "ఆధునికం"గా కనిపించే పొత్తూరు మాధవరావుది ఒక ఆసక్తికరమైన కేసు. ఇతగాడు, తన భూస్వామ్య అధికారాన్ని పయోగించి, సంవత్సరంలో 6 నెలల పాటు వెట్టి మందలు వుపయోగించుకుని, అధిక దిగుబడి వరి వంగడాలు పండించి, "వాణిజ్య రైతుల"కు యిచ్చి జిల్లా బహుమతి సంపాదిస్తాడు. నిజానికి, యీ బలవంతపు (వెట్టి) గొర్రెల "నజరానాలు", భూములకు బలవంతంగా (వెట్టి) ఎరువులు — యివి సిరిసిల్లా పోరాటంలో ప్రధానాంశాలుగా కనిపిస్తాయి. ప్రధానంగా చిట్టడవు (Shrub) ఉన్న ప్రాంతం గనుక, గొర్రెల పెంపకం యిక్కడ కాస్త లాభసాటి వ్యాపంగం కావడం సహజమే. గొర్రెల బలవంతపునజరానాలకువ్యతిరేకంగా పోరాటం భూస్వాములకే గాకుండా, ఫారెస్టు అధికార్లకు - చౌకీదారు నుంచి పున్నతాధికారి దాకా-కూడా వ్యతిరేకమైనది. లాంఛన ప్రాయ-బూర్జువా పాలన యంత్రం (Formally bourgeois administration) లోని యీ వుద్యోగులు పూర్తిగా ఫ్యూడల్ రూపాల్లో దోపిడి చేయడంలో సిద్ధహస్తులు. గొర్లు అడివిలో మేసినందుకు వీళ్ళు జుల్మానా వేయరు. 'తన' భూమిలో మేసినందకు పరిహారంగా భూస్వామి గొర్రెల రూపంలో బహుమతి డిమాండ్ చేసినట్లే, వీళ్ళు కూడా అడివిలో గొర్రెలు మేసినందకు సంవత్సరానికి కొన్ని గొర్రెలు "బహుమతి"గా తీసుకుంటారు.

## వెట్టి రద్దు

ఎమర్జెన్సీతర్వాత దాలకాలానికి, 1979-80లో జరిగినప్పటికి వెట్టి గొర్ల సమస్యకు వ్యతిరేకంగా జరిగిన ఒక పోరాటాన్ని యీ పోరాటం తీవ్రతకు ఒక నమూనాగా చూడవచ్చు. ఆ వూరిపేరు నామాపురం. అక్కడ భూస్వాములు రెడ్లు. వారిలో అతిపెద్ద భూస్వాములకు (ఇద్దరి పేర్లూ నారాయణ రెడ్డే) యిప్పటికీ 100 ఎకరాల బంజరుతో కలిపి 500 ఎకరాల భూమి వుంది భూస్వాములందరూ కలిసి ఏడాదికి 40 వెట్టి గొర్లని గుంజుకునే వాళ్ళు. ఈ దోపిడిని నిలిపి వేసి దసరా నాడు వెట్టి గొర్రె లివ్వ కూడదని, గొల్లవారు 1978 లో నిర్ణయించుకునే దాక, యీ దోపిడీ సాగుతూ వచ్చింది. భూస్వామి కుటుంబాల్లోని కొందరు యువకులకు దీనితో ఆగ్రహం వచ్చింది. సాయంత్రం తోలకొని యిళ్లకు వస్తున్న గొల్లవారిని దారికాచి అటకాయించి, బలవంతంగా కొన్ని గొర్లు స్వాధీనం చేసుకున్నారు. ఆ తరువాత గొల్లవారు ఒక గుంపుగా వెళ్లి తమ గొర్లు తిరిగి తెచ్చుకున్నారు. తిరిగి, 1979లో ఒక రెడ్డి కుటుంబంలో పెళ్లి సందర్భంగా వెట్టి గొర్లు యివ్వడానికి నిరాకరించారు. దీనికి ఆగ్రహించిన కొందరు భూస్వాములు గొర్లు తమ భూముల్లో మేశాయనే సాకుతో కొన్ని గొర్రెలను పట్టి బందెలదొడ్డికో వేశారు. ప్రజలు వూరేగింపుగా వెళ్లి తమ గొర్లను విడిపించుకున్నారు. కాని, నెలరోజుల తరువాత, ప్రజలు సిరిసిల్లాలో ఒక బహిరంగ సభకు వెళితే, భూస్వాములు మరోసారి గొర్లను బందెదొడ్లో వేసి 250 రూ.లు జుర్మానా విధించారు. గొల్లవారు జుర్మానా అయితే చెల్లించారు, కాని, గొర్లను, మేకలను బహుమతి యిచ్చే ఫ్యూడల్ ఆచారాన్ని మాత్రం తిరిగి తలెత్త నివ్వలేదు.

జనం మొండిగా వున్నారని గ్రహించిన భూస్వాములు రైతు కూలి సంఘం మీద పోరాడ్డానికి ఒక "రైతు కూలి సంఘం" అనే దాన్ని ఏర్పరుచుకున్నారు. తమకు లొంగి వుండే గొల్ల కులం "పెద్ద"లను ప్రక్క గ్రామాలనుండి తీసుకువచ్చారు. చిన్న మోతాదులో బహుమతు లిచ్చేట్లు ఆ గ్రామ గొల్లవారిని బలవంతంగా ఒప్పించారు. వెట్టి గొర్ల సంఖ్య 40 నుండి 25 కు దిగింది. గొల్లవారు 500 రూపాయలు దండుగ చెల్లించాలి. ఆ తరువాత, అదే ఏడు, అడివిలో గొర్రెలు మేపినందుకు ఫారెస్టు అధికారులు

## 'భూస్వామ్యవ్యతిరేకపోరులో బలమైన ఆయుధంగా సాంఘిక బహిష్కరణ'

వసూలుచేసే దండుగలకు (నిజానికివి లంచాలు) వ్యతిరేకంగా తాలూకా వ్యాప్తంగా వుద్యమం వచ్చింది. దీనిలో భాగంగా, సిరిసిల్లా పట్నంలో ఒక ఊరేగింపు జరిగింది. నామాపురం గొల్లవారుకూడా దీన్లో కలిశారు. భూస్వాములు మరోసారి మళ్ళిన్ని గొర్లను బందెలదొడ్లో వేశారు. గొల్లవారు సంఘం నాయకత్వంలో, పక్కవూళ్ళనుండి తమ కులంవాళ్ళను సమీకరించి, వాటిని విడిపించుకోవాలని నిర్ణయించుకున్నారు. దాంతో 100 మంది వూరేగింపుగా వెళ్ళి గొర్లను విడిపించుకున్నారు. 1980 వచ్చింది. ఒక భూస్వామి తన ఆధీనంలోని భూమిలో గొర్రెలు మేపుకోడాన్ని తిరస్కరించాడు. 100 రూ. లు దండుగ వసూలు చేశాడు. ఇలాంటి ఘటనలింకా జరుగుతున్నాయి. కాని, వెట్టి రద్దు అన్నది ఖాయం గనుక, యిలాంటివి కొడిగట్టిన దీపంలాంటివే.

ఈ పోరాటం ఇంత సుదీర్ఘంగా జరగడం చూస్తే, యిక్కడ భూస్వామ్య ఆధారాలు ఎంత లోతుగా వేళ్ళూనుకొని వున్నాయో అర్థం అవుతుంది. అదే సమయంలో, యిక్కడ పోరాటం ప్రధానధోరణి, సరుకులు ఉత్పత్తిచేసే రైతు "పరిశ్రమ" ("enterprise") కూ, భూమి గుత్తాధిపత్యానికీ మధ్యనున్న ఘర్షణ కాదు. గ్రామీక ప్రజలకు, భూస్వామ్య సామాజిక సంబంధాలకు మధ్య ఘర్షణే ప్రధాన ధోరణి, భూమిపై గుత్తాధిపత్యం ఈ ఘర్షణకు దోహదకారి మాత్రమే. భూమి ఒక సమస్యగా ముందుకొచ్చినచోట్ల అది నీటిపారుదల భూమి కాదు. వాణిజ్యపంటలకనువైన మెట్టభూమి కాదు. కేవలం సారంలేని అర్థ-బంజరు భూమి అయినా, దీనిలో తక్కువ రకం ధాన్యం పండించుకోవచ్చుననే ఆశతో పేదలు దీనిపట్ల ఆకర్షితులవుతున్నారు. భూమి లేని వాళ్ళను భూమిలేనివాళ్లుగానే వుంచాలనే కోరికతో భూస్వామి దానిపై కన్నువేసి వుంచుతున్నాడు. పెట్టుబడి గురించిన ఆలోచనల్లో మునిగిన పరిశీలకులు దీనిపై ఏ భాష్యాలు చెప్పినా, తెలంగాణాలో రైతాంగ పోరాటాల ప్రధాన కేంద్రీకరణ భూస్వామ్య అధికారం, లేక, "పెత్తందారీ" తనమే.

ఎమర్జెన్సీ ఎత్తివేయబడిన తరువాత, పార్టీ, సంఘం రెండూ బహిరంగంగా పనిచేయడం మొదలు పెట్టాయి. అంతేగాక, వాళ్లు, రెండు పశ్చిమ ప్రాంతాల నుండి పాత తాలూకా ఆగ్నేయ ప్రాంతానికి (ప్రస్తుత వేములవాడ తాలూకా తూర్పు ప్రాంతం) విస్తరించారు. ఇక్కడ, నూకలమర్రి వంటి గ్రామాల్లో పార్టీకి కొన్ని సంబంధాలుండినాయి ఎమర్జెన్సీలో రాత్రి పాఠశాలలు కూడా నడిపించారు. 1977 తరువాత యీ ప్రాంతంలోని పెక్కు గ్రామాల్లో సంఘాలు త్వర త్వరగా ఏర్పడ్డాయి. అదే సమయంలో, పదమట నిమ్మపల్లిలో "22 ఎకరాల హరిజనుల" భూమిపై పాత పోరాటాన్ని తిరిగి చేపట్టారు

అప్పటి ఆం. ప్ర. గవర్నర్ శారదాముఖర్జీ 1977లో, వేములవాడకు వెళ్లినప్పుడు జరిగిన ఘటన ఎమర్జెన్సీ-తరువాత వుద్యమానికి ఒక కొండగుర్తు. పార్టీ పనిచేస్తున్న అన్ని గ్రామాలనుండి పెద్దఎత్తున ప్రజల్ని తరలించి, వేములవాడలో వూరేగింపు జరిపి, మెమొరాండం యివ్వడానికి ప్రయత్నించారు. డి.ఎస్.పి. నాయకత్వంలోని పోలీసు బలగం, వారిని అడ్డగించింది. ప్రజలు కోపొద్రిక్తులై డి.ఎస్.పి.ని దేవాలయం కోనేటిలో పడేస్తామని బెదిరించారు. (వేములవాడ ప్రాంతీయంగా 'దక్షిణకాశీగా' ప్రసిద్ధి చెందిన దేవాలయాల పట్నం). డి.ఎస్.పి. మూర్ఖంగా ప్రవర్తించేసరికి, తమ బెదిరింపును అమలు జరుపబూనారు. సంఘం జోక్యం చేసుకుని డి. ఎస్. పి.ని బతికించింది.

ఇట్లాంటి వీరోచిత చర్యకు మూల్యం వుండక తప్పలేదు 70 మంది మీద కేసులు పెట్టారు. ఎమర్జెన్సీ తరువాత వుద్యమం ప్రవేశించిన గ్రామాలంతటా యీ సంఘటన ప్రభావం చూపించింది. ఇక్కడ వుద్యమం నూకలమర్రి, చెక్కపల్లి, కొదురుపాక వంటి గట్టి గ్రామాలను కేంద్రంగా చేసుకుంది. నూకలమర్రి మీద, - ఎ ఐ.సి.పి (ఐ) ప్రధాన కార్యదర్శి సత్యనారాయణరావు బావమరిది భాస్కరరావు (160 ఎకరాల భూస్వామి) ఆధిపత్యం కొనసాగుతుండే ప్రక్కనే వున్న చెక్కపల్లిలో కర్కోటక భూస్వామి భగవంతరావు రాజ్యం చేస్తున్నాడు. కొదురుపాక మీద పెత్తనం భగవంతరావు బామ్మరిది వెంకటాచురావుది. ఇప్పటికి పాతేండ్ల వయస్సు వచ్చి యీ ప్రాంతంలో 70 గ్రామాలకు విస్తరించిన పోరాటానికి యీ త్రయమే కేంద్ర బిందువు. భాస్కరరావు పూర్వ కౌల్దారుకు కౌల్దారీ చట్టం క్రింద పది ఎకరాల భూమి యిచ్చివేయడానికి తిరస్కరించాడు. భగవంతరావు, ప్రత్యేకించి, తన మొత్తం భూమిని వెట్టికి దున్నించుకోవడమేగాక, 10-20 మందిని తన యింటిలో వెట్టికి సేవచేయించుకునేవాడు అతని సేవకులలో ముగ్గురు, సి. పి. ఐ. (ఎం. ఎల్) వాళ్ళను కలుసుకుని, 'అతని' గ్రామంలోనే సంఘం మొదలెట్టారు. దాంతో యితనికి కష్టాలు మొదలయ్యాయి. అతనిమీద పోరాటం

తీవ్రమయ్యే సరికి, తన ఫ్యూడల్ అధికారాన్ని ప్రయోగించుకుని, తన గ్రామంలోని కొందరు జనాన్ని కూడదీసుకుని, వేములవాడ నుండి చెక్కపల్లికి "భగవంతరావు భగవంతుడు" అనినినాదాలు చేయిస్తూ, వూరేగింపు తీయించాడు. కాని దీని వల్ల ప్రజల్లో కలిగిన భయాన్ని, ఆ వెంటనే రెండు రోజుల తరువాత సంఘం జరిపిన వూరేగింపు పోగొట్ట గలిగింది. ఈ పోరాటం కాలంలో ఒక ఘటన జరిగింది. (ఢిల్లీ పి యు సి.యల్. టీమ్ వచ్చి వెళ్ళడం వల్ల ఈ ఘటన వార్త కొంత ప్రాముఖ్యతను సంతరించుకుంది.) కొదురు పాక గ్రామంలో భూస్వామి వెంకట్రామరావు కిరాయి గూండాలు ఒక మధ్య వయస్కురాలైన స్త్రీ, రాజవ్వను మానభంగం చేశారు. ఇది పూర్తిగా "రాజకీయ" మానభంగం, మిలిటెంట్ మహిళా సంఘాన్ని నిర్మించినందుకు రాజవ్వకు శిక్షగా జరిగిన చర్య. (సిరిసిల్లా వుద్యమంలో 20, 25 గ్రామాల్లో - ప్రధానంగా తీవ్ర నిర్బంధం క్రింద మగవాళ్లు గ్రామాలు వదిలి వెళ్ళిన ఫలితంగా- యిలాంటి మహిళా సంఘాలు పుట్టుకొచ్చాయి.) తాజా పరిస్థితి ఏమిటంటే వెంకట్రామరావు గూండాల మీద కేసు ఎగిరిపోయింది. కాని, రాజవ్వ మాత్రం చివరిదాక పోరాడాలనే దృఢ నిశ్చయంతో వుంది.

కల్లోలిత ప్రాంతాల చట్టం ప్రకటన దొరల చేతులకు బలం యిచ్చిందనడంలో సందేహంలేదు. కాని వారి వెన్నెముక వంటి - భూస్వామ్య పెత్తందారీ సంబంధాలు మాత్రం తిరిగి అతుక్కోకుండా విరిగిపోయింది. 1978 పూర్వంలాగే బహిరంగ పోరాటాలు బాగా కష్టం కావచ్చు. గాని పరిస్థితి మౌలికమైన మార్పునకు లోనయ్యింది. నిర్దిష్ట విజయాలను పేర్కొనాలంటే, మొత్తం వుద్యమ ప్రారంభ బిందువైన, నిమ్మపల్లి 22 ఎకరాల భూమి అంతిమంగా హరిజనుల పరం అయ్యింది. తునికాకు వుద్యమం సంఘటితమయింది. ఈనాడు అన్ని వెట్టి కట్టలు రద్దు కావడమే గాక, కట్టకు 10 నుండి 12 పైసలు రేటు దొరుకుతున్నది. వ్యవసాయ కూలీ, పాలేర్ల వేతనాలు పెరిగాయి. (నిజానికివి ఏడాది ఏడాదీ ముందుకొచ్చే సమస్యలే. ప్రతి పంట కాలంలో రెండుసార్లు - నూర్పిళ్లు, కోతలు-ముందుకు వచ్చి పెద్ద ఎత్తున తాలూకా వ్యాప్త వుద్యమాలుగా వస్తుంటాయి. కార్యకర్తలు తమ శ్రద్ధనంతా ఫ్యూడల్ పెత్తందారీ-వ్యతిరేక పోరాటాలపై కేంద్రీకరించడం వల్ల వాళ్ళతో మాట్లాడేప్పుడు కూలీ సమస్య ప్రస్తావన అరుదు మాత్రమే వస్తుంటుంది.) అతి ముఖ్యంగా, వెట్టి పూర్తిగా అదృశ్యమయ్యింది. గ్రామంలో తగాదాలలో దొరలు న్యాయ నిర్ణేతలుగా కూర్చోవడం ముగిసింది. ఈ రెండింటని పేర్కొనడం చాలా తేలిక. కాని యివి గ్రామీణ తెలంగాణాలో పెద్ద మార్పును సూచిస్తాయి. కర్కోటక భూస్వామి చెక్కపల్లి భగవంతరావుతో సహా, ఎక్కువ మంది దొరలు గ్రామాలు వదిలి వెళ్లారు. తమ భూముల్లో చాలా భాగం అమ్మేసుకొని కరీంనగర్ లోను, హైదరాబాద్ లోను జీవిస్తున్నారు.

**బాలగోపాల్**

**కోదండరామిరెడ్డి**

## సాంఘిక బహిష్కరణ

వాళ్లు (భూస్వాములు) సులభంగా పోరాటం వదులుకున్నారని కాదు. రాజవ్వ మాత్రమే కాదు. బోయినపల్లి లక్ష్మి వంటి మరి పెక్కు మంది స్త్రీలు భూస్వాముల, గూండాల చేతిలో మానభంగాలకు గురయ్యారు. 1980 జనవరి నెలలో. సిరిసిల్లా పట్టణంలో, 8000 మంది జనం వూరేగింపుపై పోలీసులు కాల్పులు జరిపినప్పుడు మరణించిన జక్కుల ఎల్లయ్య మాత్రమేగాక. తిమ్మాపురం లక్ష్మిరాజం వంటి కార్యకర్తలు భూస్వాముల చేతిలో హత్యలకు గురయ్యారు. కల్లోలిత ప్రాంతాల ప్రకటనకు ముందుగానీ, తర్వాతగాని తమకు ధారవుదారంగా లభించిన పోలీసుసహాయంతో తృప్తి పడివూరుకోలేదు. వాళ్లు మొదట్నుండి చివరిదాక ఫ్యూడల్ దొరలే. రైతులకు వ్యతిరేకంగా పోరాడ్డానికి సొంత గూండా గ్యాంగులకు శిక్షణ నిచ్చి, సాయుధుల్ని చేశారు. పోలీసులను తాత్కాలిక సాయంగానే భావించారు. ఉదాహరణకు జోగాపురం జగ్గారావు తన గ్యాంగును సాయుధం చేయడానికి 40 విచ్చు కత్తులు సంపాదించి పెట్టుకున్నాడు. వేములవాడ సమితి ప్రెసిడెంటు పాపారావు నాయకత్వంలో, యితర భూస్వాములు దొంగల ముఠాలకు శిక్షణ నిచ్చి, "నక్సలైట్ పార్టీ" పేరిట దొంగతనాలు చేయించి, ఆవిధంగా ప్రజలను పార్టీ నుండి దూరం చేయాలని ప్రయత్నించారు. ముఖ్యంగా, వెట్టి చాకిరీ రద్దు చేసి, పెక్కుమంది భూస్వాములను గ్రామాల నుండి వెళ్లగొట్టిన తరువాత, వుద్యమం సాధించిన ఒక ముఖ్య విజయం- యీ దొంగల ముఠాలను పట్టుకొని, పోలీసులపై వత్తిడి తెచ్చి వారిని అరెస్టు చేయించడం. (యీ పనికి పోలీసులపై చాలానే వత్తిడి తీసుకు రావలసి వుంటుందని, సులభంగా వూహించుకోవచ్చు.)

శత్రు దాడిలాగానే ప్రజల ప్రతిఘటన కూడా విభిన్నమైన రూపాలు తీసుకుంటూ వుంటుంది. "నక్సలైట్ హింసా విధానా" (Naxalite cult of violence) అనేదాన్ని ప్రభుత్వం చాలా శ్రద్ధా క్ర

లతో ప్రచారంలో పెట్టడంవల్ల, పార్టీ తీసుకున్న కొన్ని (ప్రతిఘటనా) రూపాలపై ప్రజలు విశ్వాసం వుంచడం కష్టం. ఉదాహరణకు, యీ ప్రాంతాన్ని కల్లోలిత ప్రాంతంగా ప్రకటించిన తరువాత, పోలీసులు రాత్రిళ్లు గ్రామాలపై దాడులు చేయడం మొదలు పెట్టారు. దీన్ని నిరోధించడం కోసం గ్రామాలకు గ్రామాలు (భూస్వాములు, వారి కిరాయి గూండాలు మినహా) సాంప్రదాయిక జానపద గీతాలో, భక్తి గీతాలో పాడుకుంటూనో లేక హరిదాసు చెప్పే పౌరాణిక గాధలు వింటూనో మేలుకోవాల్సి వచ్చింది. అట్లా కాకుంటే వాళ్లు తమ యిళ్ల బయట కూర్చుని, అల్యూమినియం ప్లేట్ల మీద, లోటాలు చెంబుల మీద గరిటెలతో కొడుతూ, రాత్రంతా, ఒక పెద్ద రణగొణ ధ్వనిసృష్టి చేవాళ్లు. తునికాకు కూలీ రేట్ల పెంపుదల వంటి సీజనల్ పోరాటాల సమయంలో, పోలీసులు ముందు జాగ్రత్తలు తీసుకుని, బలగంతో గ్రామాలకు వెళ్లి సమ్మె పిలుపు పోస్టర్లు కూడా అతికించకుండా వుంచడానికి ప్రయత్నిస్తారు. దీనికి వ్యతిరేకంగా కొన్ని గ్రామాల్లో సంఘం ఒక దేశీయ సృజనాత్మక పద్ధతిని ప్రయోగించింది. సాయంత్రం యిళ్లకు చేరుకునే పశుల కాపరులకు పోస్టర్లతికించే కార్యక్రమం అప్పజెప్పడం జరిగేది. వాళ్లు పశువుల్ని వుసిగొల్పి తోలుతూ దారి ప్రక్కన నించున్న పోలీసులను బెదరగొట్టి, వాళ్లు తిరిగి నిలదొక్కుకునే లోపల పోస్టర్లు అతికించేవాళ్లు. ఉద్దేశ్యపూర్వక ప్రచారం క్రింద కళ్లు మూసుకు పోయిన వాళ్లు తప్ప, మరెవరయినా, ఒక ప్రజా వుద్యమం (Mass Movement) ప్రజా (Mass) ఎత్తుగడల్ని స్వీకరించక తప్పదని గుర్తించగలుగుతారు.

అదే విధంగా, ఇండియా కమ్యూనిస్టులు కులంవంటి-ఇండియాకు ప్రత్యేకమైన సాంస్కృతికలక్షణాలను-ఎప్పుడూ గుర్తించలేదని పాచిపండ్ల దాసరి మాదిరి ఫిర్యాదుచేసే వాళ్లు, ఒక సంగతి తెలుసుకోగలుగుతారు., ఇక్కడ, భూస్వామ్య - వ్యతిరేక పోరాటాలలో చాల బలమైన ఆయుధంగా "సాంఘిక బహిష్కరణ" పనిచేసింది. హిందూ 'ధర్మ' నిర్వచనాలతో శారీరక శ్రమను అసహ్యించుకోవడం ఒకటి. అందువల్ల, శ్రామిక ప్రజలు భూస్వాముల యిళ్లల్లో పనిపాటలను బహిష్కరించడం చాల బలమైన ఆయుధంగా పని చేస్తుంది. ఇది, భూస్వామ్య-వ్యతిరేక పోరాటంలో, పెట్టుబడికి వ్యతిరేకంగా కార్మికుల సమ్మెలంత బలంగా పని చేస్తుంది. భూస్వామ్య కుటుంబాలలో స్త్రీ, పురుషులు ఏ విధమైన "నీచ" శ్రమ చేయరు. కనుక, చాకలి, మంగలి, హరిజన ప్రజలు అపనులను బహిష్కరించడం, చాలసార్లు భూస్వాములను లొంగదీయడానికి సరిపోతుంటుంది. చాల గ్రామాల్లో మొదట అనుసరించే ఎత్తుగడ, సాధారణంగా యిదే ముఖ్యంగా, వెలమ భూస్వాముల విషయంలో ఇది బాగా పనిచేస్తుంది. రెడ్లకంటె వెలమలు మరింత పొగరుగా వుంటారు.

## ఆధునాతనమైన నిర్బంధం

తీవ్ర నిర్బంధం, శత్రువు ఆధునిక తెలివి తేటలకు పూనుకోవడం యీనాటి పరిస్థితి. అంటే పోరాటం ఫలితంగా "భూస్వామ్య విధానం పోయి, పెట్టుబడిదారీ విధానం వచ్చిందని" కాదు. కార్యకర్తలు స్పష్టంగా గుర్తిస్తున్నట్లుగా అసలు పరిస్థితి దాని కంటె చాల సంక్లిష్టమయినది. దొరలు-అంటే, గ్రామాలు వదలి వెళ్ళని దొరలు, తమ పెత్తందారీ మచ్చలలో అత్యంత అసహ్యకరమైన వాటిని మార్చుకొన్నారు. బహిరంగప్రవర

# సిరిసిల్ల-వేములవాడ రైతాంగ పోరాటం

(8వ పేజీ తరువాయి)

...వలో ఎక్కువ "ప్రజాతంత్రం"గా మారారు. పూర్వం వాళ్ళ భూముల్ని వెట్టి చాకిరి క్రింద, లేక 'కట్టు బానిస' పాలేళ్ల క్రింద, ఎక్కువగా చెప్పాలంటే, కౌలుచెల్లించే కౌల్దార్ల క్రింద సాగు అయ్యేవి. ఇవాళ ఎక్కువ మంది 'కౌరు'కు యిస్తున్నారు. (అంటే పంటలో భాగం పద్ధతిలో యిస్తున్నారు. ఖర్చుల లోను, వుత్పత్తులలోను (తరి పొలాల్లో) భాగం సగం సగం. వాళ్ళకిప్పుడు వెట్టి దొరకదు. కాని వేరే పద్ధతులతో వసూళ్లు చేసుకుంటున్నారు. ప్రభుత్వం అవలంబించిన పెక్కు "అభివృద్ధి పథకాల" నుపయోగించుకుని, బ్రోకర్లుగా మారి ప్రజల మూల్గులు పీలుస్తున్నారు. కాని వీళ్లు కమీషన్ మీద పని చేసే మామూలు బ్రోకర్లుకారు. 'గ్రామ పెద్దల' రూపం ధరించి, ప్రభుత్వ అభివృద్ధి సంస్థలలో దబ్బు గ్రామ ప్రజల తరపున ప్రాతినిధ్యం వహిస్తారు. 'ఖర్చుల' అనబడే రూపంలో డబ్బు చాల దయతో స్వీకరిస్తారు. వాళ్ళలో చాల మంది భూమి తనఖా బ్యాంకుల, వ్యవసాయ బ్యాంకుల ఛైర్మన్లుగా, సహకార (ఋణ) సంఘాల, పంచాయతి సమితుల అధ్యక్షులుగా, రాజకీయ పార్టీల నాయకులుగా మొదలైన రూపాలు ఎత్తడం వల్ల, యీ కొత్త దోపిడీ పాత్ర వీరికి సాధ్యం అవుతున్నది దీనికి మంచి వుదాహరణ సి. పి ఐ. నాయకుడు సి. హెచ్ రాజేశ్వరరావు. ఒక దేశ్ముఖ్ కుటుంబంలో పుట్టినవాడు. ఇతర సోదరులలో ఒకరు జిల్లా వ్యవసాయ బ్యాంకు వుపాధ్యక్షులు. మరొకరు భారతీయ జనతా పార్టీ నాయకులు.

మరో మాటలో చెప్పాలంటే, సారాంశంలో పితృస్వామికమైన సంబంధాలే యిప్పుడు కొత్త వ్యక్తీకరణ రూపం తీసుకున్నాయి. ఈ కొత్త రూపం గ్రామిక ప్రజల్ని విభజించి, వారిని కార్యాచరణలో ఐక్యం చేయడాన్ని కష్టతరం చేస్తుంది యీ మేరకు పాత దాని నుండి దీనిలో కొంత తేడా వున్న మాట నిజమే. "పెట్టుబడి విభజిస్తుంద''నే మామూలు భావానికి ఒక రూపం. కాని కార్యకర్తలను బాధిస్తున్న సమస్య ప్రజలను ఐక్యం చేయడంతో కలుగుతున్న కష్టంకాదు, పోలీసు నిర్బంధాన్ని ఎదుర్కొనడమే వారి సమస్య. ఈనాడు నిర్బంధం చాల తీవ్రంగా వుంది. రెండు తాలూకాలలో కొన్ని తప్ప మిగిలిన ఏ గ్రామంలోనయినా ప్రజలతో వుద్యమం గురించి బహిరంగంగా చర్చించడం దాదాపు అసాధ్యంగా వుంది.

(1982, నవంబర్ 27, ఎకనమిక్స్ అండ్ పొలిటికల్ వీక్లీ సౌజన్యంతో)

ముద్రణ: విమోచన (పక్షపత్రిక) 15-2-83, 1-3-1983.